సాక్షి బాపట్ల

శనివారం । 7 । అక్టోబర్ । 2023



గుడికి రూ.4 లక్షల విరాళం

వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ కొండ పైన రామలింగేశ్వరస్వామి గుడి పునర్నిర్మాణానికి నరసరావుపేట రోడ్డులోని బాలాజీ కోల్డ్ స్టోరేజీ రూ. 4లక్షలు అందించింది.



విశ్వేశ్వరస్వామి కల్యాణం

పాత గుంటూరు: బ్రాడీపేట రెండో లైనులోని గౌరీ విశ్వేశ్వరాలయంలో స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా శుక్రవారం కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

నగరవనం ఏర్పాట్ల పరిశీలన



చిలకలూరిపేటటౌన్: బొప్పూడి వెంకటేశ్వర స్వామి కొండ చుట్టూ తలపెట్టిన నగరవనం ఏర్పాట్లను పల్నాడు కలెక్టర్ లోతేటి శివశంకర్ శుక్రవారం రాత్రి పరిశీలించారు. వనం ఏర్పాటుకు భూమిని పరిశీలించారు. పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పాపురం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీ 99.17 శాతం పూర్తి



నరసరావుపేట: జిల్లాలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ 99.17 శాతం పూర్తయింది. మొత్తం 28 మండలాల్లో అత్యధికంగా సత్తెనపల్లి మున్సిపాలిటీలో 99.48 శాతం పూర్తికాగా, అత్యల్పంగా నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్ల మండలంలో 98.84 శాతం జరిగింది. జిల్లాలో ఈ నెలకు 2,82,179 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉండగా ఐదో తేదీ గురువారం రాత్రి నాటికి 2,79,853 మందికి అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్ వెల్లడించారు. మొత్తం లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము రూ.78,35,59,500 అందజేయాల్సి ఉండగా 77,70,69,500లను సచివాలయ వెల్ఫేర్ ఉద్యోగులు, వలంటీర్లు కలిసి పంపిణీ చేశారు.

టీడీపీ ర్యాలీకి అనుమతుల్లేవు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఈనెల ఏడో తేదీన తెలుగుదేశం పార్టీ గుంటూరు నగరంలో తలపెట్టిన ర్యాలీకి ఎటువంటి అనుమతుల్లేవని గుంటూరు పశ్చిమ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఉమ్మడి జిల్లాలోని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు శనివారం గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి మార్కెట్ కూడలిలోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు తలపెట్టిన ర్యాలీకి ప్రభుత్వ, పోలీస్ అనుమతుల్లేవని డీఎస్పీ వెల్లడించారు. జిల్లాలో 30 పోలీస్ చట్టం, 144 సీఆర్‌పీసీ ఆర్డర్స్ అమల్లో ఉన్నాయని వివరించారు. నిబంధనలు మీరి ఎవరైనా ర్యాలీ నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యార్డులో 27,490 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 24,052 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 27,490 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.13,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 8,068 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

9న వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభ



సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 9న వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభ జరగనుంది. సభకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈనేపథ్యంలో సభకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం శుక్రవారం పరిశీలించారు. డీసీపీ విశాల్‌గున్నీతో కలిసి పోలీస్ అధికారులతో సమీక్షించారు. వేదిక, ప్రజాప్రతినిధులు వచ్చే ప్రవేశ మార్గాలు, వాహనాల పార్కింగ్ వంటి విషయాలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ రమణమూర్తి, ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసాద్, ఏసీపీలు భాస్కరరావు, వెంకటనారాయణ. సీఐలు, గుణరాం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.2,800, గరిష్ట ధర రూ.4,300, మోడల్ ధర రూ.3,400 వరకు పలికింది.

పల్లెలకు మహర్దశ

సంక్షేమానికి తోడు అభివృద్ధి

- మండలానికి రూ.60 లక్షల నిధులు
- గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు
- గ్రామాల్లో మౌలికవసతుల కల్పనే లక్ష్యం



అద్దంకి మండలంలోని ఓ గ్రామంలో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పల్లె మురిసింది.. సంక్షేమంతో తడిసి ముద్దవుతోంది. ఎప్పుడు లేని విధంగా అర్హులకు సంక్షేమ దక్కుతోంది.. సంక్షేమంతో పాటు అభివృద్ధికి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.. గ్రామీణ ప్రాంతాలకు నిధుల భారీగా కేటాయించింది. గతంలో ఇచ్చిన మాట మేరకు తాజాగా మండలానికి రూ.60 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే నియోజకవర్గాల శాసన సభ్యుల ద్వారా చేపట్టబోయే పనులకు సంబంధించిన ప్రతిపాదనలు తీసుకున్న అధికారులు సదరు ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ప్రభుత్వం అవసరమైన నిధులను మంజూరు చేసింది.

జిల్లాలో రూ.14.39 కోట్లతో 208 పనులు...

జిల్లాలోని 25 మండలాల పరిధిలో 208 పనులకు రూ.14.39 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. గుర్తించిన పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టనున్నారు. బాపట్ల మండలానికి 20 పనులకు గాను రూ.47.7 లక్షలు, అద్దంకి ఏడు పనులకు రూ.60 లక్షలు, బల్లికురవలో తొమ్మిది పనులకు రూ.60 లక్షలు, జె.పంగులూరు 7 పనులకు రూ.60 లక్షలు, కొరిశపాడు 8 పనులకు రూ.60 లక్షలు, సంతమాగులూరు 12 పనులకు రూ.60, కర్లపాలెం 19 పనులకు రూ.55 లక్షలు, పిట్టలవానిపాలెం 5 పనులకు రూ.50 లక్షలు మంజూరు చేయగా చీరాల 12 పనులకు రూ.60 లక్షలు, వేటపాలెం 11 పనులు, చినగంజాం ఎనిమిది పనులు, ఇంకొల్లులో ఐదు పనులు, కారంచేడు 8 పనులు, మార్టూరు మండలంలో ఆరు పనులు, పర్చూరు మండలంలో ఏడు పనులు, యద్దనపూడిలో మూడు పనులు, చెరుకుపల్లి మండలంలో ఏడు పనులు, నగరం తొమ్మిది పనులు, నిజాంపట్నం ఐదు పనులు, రేపల్లె తొమ్మిది పనులు, అమృతలూరు ఎనిమిది పనులు, భట్టిప్రోలు మండలంలో 4 పనులు, కొల్లూరు మండలంలో ఏడు పనులు, చుండూరు మండలంలో మూడు పనులు, వేమూరు మండలంలో తొమ్మిది పనులు రూ.60 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది.

మౌలిక వసతులు...

ప్రభుత్వం తాజాగా మంజూరు చేసిన నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, అప్రోచ్ రోడ్లు నిర్మించనున్నారు. ఉపాధి హామీ నిధులతో ఈ పనులు చేపట్టనున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీరింగ్ విభాగాలు పనులను పర్యవేక్షించనున్నాయి. పనులను ప్రభుత్వం మంజూరు చేసిన నేపథ్యంలో ఆయా శాఖల మండల అధికారులు పనులకు సంబంధించిన అంచనాలను రూపొందించి జిల్లా కలెక్టర్ ద్వారా ఆమోదం తీసుకొని పనులు మొదలు పెట్టనున్నారు.

ఇప్పటికే ఉపాధి నిధులతో..

జిల్లాలో ఉపాధి హామీ నిధులు తగినంతగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఇప్పటి వరకు రూ.216.26 కోట్ల మేర పనులు చేశారు. ఇందులో రూ.164. 48 కోట్లు వేతనాల రూపంలో ఖర్చు చేశారు. మెటీరియల్ కింద రూ.46.77 కోట్లు వెచ్చించారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద ఇంకా రూ.90 కోట్ల నిధులు ఉన్నాయి. దీంతో పనులు పూర్తియి వెంటనే ప్రభుత్వం కొత్త పనులకు బిల్లులు చెల్లించనుంది. ఇప్పటికే జిల్లాలో వందలకోట్లతో వివిధ విభాగాల్లో భవననిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

మౌలిక వసతులు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం



జిల్లాలో మౌలికవసతుల కల్పన, పారిశుద్ధ్యం మెరుగుకోసం ప్రభుత్వం కొత్తగా రూ.14.39 కోట్లు మంజూరు చేసింది. త్వరగా అంచనాలు సిద్ధం చేసి పనులు చేపట్టనున్నాం. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీచేశాం. ఇప్పటికే జిల్లాలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. వాటికితోడు మండలానికి రూ.60 లక్షలు మంజూరు అయ్యాయి.

– రంజిత్‌బాషా, కలెక్టర్, బాపట్ల జిల్లా

ఉపాధిహామీ ద్వారా పనులు



జిల్లాకు ప్రభుత్వం కొత్తగా 208 పనులు మంజూరు చేసింది. ఉపాధి హామీ నిధులతో ఈ పనులు చేపట్టనున్నాం. ఈ పనుల వలన గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పారిశుద్ధ్యం మెరుగుకానుంది. త్వరలోనే జిల్లా కలెక్టర్ అనుమతులతో పనులు మొదలు కానున్నాయి. నిధుల కొరత లేదు. పూర్తయిన పనులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించనున్నాం.

– శంకర్‌నాయక్, డ్వామా పీడీ, బాపట్ల

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'

- కారంచేడులో రెవెన్యూ సమస్యలే అధికం
- కలెక్టర్ రంజిత్‌బాషా



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ శ్రీధర్

కారంచేడు: గ్రామాల్లో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' నిర్వహిస్తోందని కలెక్టర్ పీ రంజిత్‌బాషా తెలిపారు. మండల కేంద్రంలోని డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు కల్యాణ మండపంలో ప్రత్యేక స్పందన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కారంచేడు మండలం నుంచి ప్రధానంగా రెవెన్యూ సమస్యలు వచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వద్దకే ప్రభుత్వ సంక్షేమ పాలన అందించే దిశగా అన్ని జిల్లాలో అన్నిశాఖల అధికారులు మీ ప్రాంతంలోకే వచ్చి మీ సమస్యలు విని వాటిని పరిష్కరించేలా ఒక కార్యక్రమం చేయడమే అందుకు నిదర్శనమన్నారు. మొత్తం 196 అర్జీలు రాగా వాటిలో 181 అర్జీలను వెంటనే పరిష్కరించినట్లు వెల్లడించారు. మిగిలిన 15 అర్జీలను రీ ఓపెన్ చేశామని, వీటిని కూడా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. వచ్చే శుక్రవారం వేమూరులో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదు..

గతంలో మాదిరిగా రాష్ట్రంలో పేద ప్రజలకు అమలు చేసే ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ఇకపై ఆదాయ, కుల ధ్రువీకరణ ప్రత్రాలు అవసరం ఉండదని జేసీ సీహెచ్ శ్రీధర్ అన్నారు. తండ్రికి సర్టిఫికెట్ ఉంటే ఇకపై వారి బిడ్డలకు ఎలాంటి విచారణ లేకుండానే కులధ్రువీకరణ ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కేవీ రామారావు, తహసీల్దారు ఎస్. వెంకటరత్నం, ఎంపీడీఓ డీ విజయలక్ష్మి, ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణే లక్ష్యం

డీఎంహెచ్‌ఓ విజయమ్మ



స్టాల్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ విజయమ్మ

ఆదిపూడి(కారంచేడు): రక్తహీనతతో బాధపడుతున్న బాలింతలు, గర్భిణులు, చిన్నారులను గుర్తించి పౌష్టికాహారాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మండలంలోని ఆదిపూడి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని శుక్రవారం పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించి అంగన్‌వాడీలను అభినందించారు. ఆమె మాట్లాడుతూ క్యాంపులో 512 మందికి పరీక్షలు చేసి మందులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కేవీ రామారావు, ఎంపీడీఓ డీ విజయలక్ష్మి, తహసీల్దారు ఎస్.వెంకటరత్నం, ఐసీడీఎస్ ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీఓ తిరుమలశెట్టి ఝాన్సీ, గ్రామ సర్పంచి నాగరాజు, డాక్టర్లు అనిత, సురేష్‌బాబు, సీహెచ్ శివ, ప్రత్యేక వైద్యులు డాక్టర్ శాంతివైష్ణవి, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ కృష్ణకుమార్, సీహెచ్‌ఓ వరలక్ష్మి, పీహెచ్‌ఎస్ రూతమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ.. అబ్బుర'బడి'

- నాడు- నేడుతో మహర్దశ
- 42 కేంద్రాలకు భవన నిర్మాణాలు
- ప్రైవేటుకు దీటుగా ప్రీస్కూల్ నిర్వహణ



బాపట్లలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో బొమ్మలతో చిన్నారులకు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్

బాపట్ల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను సుందరంగా ఆధునికీకరిస్తోంది. అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తోంది. ఆటపాటలతో కూడిన విద్యను అందించేలా చర్యలు చేపడుతోంది. నాడు-నేడు కార్యక్రమాన్ని అనుసంధానం చేస్తూ అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా పౌష్టిహారంతోపాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను దిగ్విజయంగా అందిస్తోంది. అందరూ అబ్బుర పడేలా కేంద్రాల్లో వసతులు సమకూరుస్తోంది. అద్దెభవనాల్లోని కేంద్రాలకు సొంత భవనాలు నిర్మిస్తోంది. పాత భవనాల ఆధునికీకరణకూ చర్యలు చేపట్టనుంది.

వైఎస్సార్ సీపీ హయాంలో మహర్దశ

గత ప్రభుత్వాల హయాంలో కనీస వసతులకూ నోచుకుని అంగన్‌వాడీ కేంద్రాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మహర్దశ పట్టింది. జిల్లాలో మొత్తం 1,888 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 803 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిల్లో 42 కేంద్రాలకు ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా కొత్త భవనాల నిర్మాణం చేపట్టింది. ఇవి ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి.



ఆర్వో ప్లాంట్ నీటిని తాగుతున్న చిన్నారులు

ఒక్కో భవనానికి ప్రభుత్వం రూ.14.50 లక్షలు వెచ్చిస్తోంది. రూ.10 లక్షలు భవన నిర్మాణానికి రూ. 2.80 లక్షలు విద్యుత్, నీటి సౌకర్యం, ఫర్నిచర్ సమకూర్చేందుకు ఖర్చు చేస్తోంది. మరో రూ.30 వేలతో టాయిలెట్లు ఇంటర్నల్ వర్క్‌లు చేస్తున్నారు. అలాగే ఇప్పటికే ఉన్న సొంత భవనాల ఆధునికీకరణకూ ఒక్కొక్క కేంద్రానికి రూ.5.50 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు.

పనుల్లో పారదర్శకత

భవన నిర్మాణ పనుల్లో పారదర్శకతకు అధికారులు పెద్దపీట వేశారు. పర్యవేక్షణ మొదలు నిధుల వినియోగం వరకు కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సభ్యులుగా అంగన్‌వాడీ టీచర్, గ్రామ, వార్డు మహిళా పోలీస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తోపాటు చిన్నారుల తల్లులు ముగ్గురు ఉంటారు. కమిటీ పేరున బ్యాంకు ఖాతా తెరిచి ఇద్దరికి చెక్ పవర్ ఇస్తారు. వీరి ద్వారా అవసరమైన నిధులు డ్రా చేస్తారు.

ప్రైవేటుకు దీటుగా ప్రీస్కూల్

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమూల మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రీస్కూల్ విధానాన్ని తీసుకొచ్చింది. బాల్య దశలోనే విజ్ఞానం పెంచడంతోపాటు ఆంగ్ల మీడియంలో బోధనకు చర్యలు చేపట్టింది. ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషనల్ (ఈసీసీఈ) పథకం ద్వారా మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు సమగ్ర వికాసమే ధ్యేయంగా పలు కార్యక్రమాలను రూపొందించింది. బాలల్లోని సృజనాత్మకతను వెలికి తీసేలా పీపీ -1, పీపీ -2 పుస్తకాల ద్వారా ఆంగ్ల పదాల బోధన సాగేలా చర్యలు చేపట్టింది. అలాగే కేంద్రాల్లో చిన్నారుల కోసం ఆట వస్తువులు సమకూర్చింది. గోడలపై విజ్ఞానానికి సంబంధించిన 3డీ పెయింటింగ్స్ వేయించింది. ఫలితంగా కేంద్రాలు సుందరంగా మారాయి.

శుద్ధ జలం.. ఆరోగ్యానికి బలం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం తీసుకుంటున్న తల్లులు, చిన్నారుల సంక్షేమానికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. 15 లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి ప్లాంట్లను అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో సగంపైనే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేశారు. శుద్ధి జల ప్లాంట్ల ఏర్పాటుతో నాణ్యమైన తాగునీరందిస్తున్నారు.

జిల్లాలో ప్రస్తుతం ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాలు :	1,888
గర్భిణులు :	8,080
బాలింతలు :	7,388
3-6 ఏళ్లలోపు పిల్లలు :	25,462
సొంతభవనాలు ఉన్న కేంద్రాలు :	594
అద్దెభవనాల్లో సాగుతున్నవి :	803
ప్రభుత్వ భవనాల్లో ఉన్నవి :	491

కేంద్రాల్లో కొత్త సంస్కరణలు



అంగన్‌వాడీ కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. పోషకాహారం మొదలు ఆంగ్ల మాధ్యమం అమలు వరకు ఎన్నో ప్రత్యేక చర్యలు చేపట్టింది. నాడు - నేడు ద్వారా భవనాల మరమ్మతులు పక్కా భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అత్యాధునిక వసతులు కల్పిస్తోంది.

– కె.ఉమాదేవి, సీడీపీఓ, బాపట్ల జిల్లా

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా నాణ్యమైన సరుకులు అందిస్తున్నారు. పౌష్టికాహారం ద్వారా రక్తహీనత నుంచి బయటపడుతున్నాం. ప్రైవేట్ కాన్వెంట్ల తరహాలో విద్యా బోధన సాగుతోంది. శుచి, శుభ్రతతో పాటు మినరల్ వాటర్ అందిస్తున్నారు. సంతోషంగా ఉంది.

– హెప్సిబా గర్భిణి, నిజాంపట్నం మండలం

పారదర్శకంగా సేవలు

అంగన్‌వాడీ కేంద్రంలో సౌకర్యాలు మెరుగు పడ్డాయి. పారదర్శకంగా సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఫేస్ యాప్ ద్వారా లబ్ధిదారులకు సరుకులు అందిస్తున్నాం. ప్రైవేట్ స్కూళ్ల తరహాలో ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్నాం.

– కల్పన, బాపట్ల భావరాజు తోట, అంగన్‌వాడీ కేంద్రం-2

వీఆర్‌కు గుంటూరు ఎస్‌బీ డీఎస్పీ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): అవినీతి ఆరోపణల దృష్ట్యా గుంటూరు జిల్లా స్పెషల్ బ్రాంచి (ఎస్‌బీ) డీఎస్పీ ఎ.సుభాష్‌ను ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపించారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఐదు నెలలు క్రితం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన డీఎస్పీ బదిలీల్లో సుభాష్, గుంటూరు ఎస్‌బీ డీఎస్పీగా నియమితులయ్యారు. మే 15న ఆయన బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలల క్రితం గుంటూరు జిల్లా ఎస్‌బీలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఎస్‌బీ సీఐ నరసింహారావును తొలుత వీఆర్‌కు పంపిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. సీఐతో పాటు డీఎస్పీపైనా విచారణ చేపట్టారు. గుంటూరు ఏఎస్పీ (క్రైం) శ్రీనివాసరావును విచారణ అధికారిగా నియమించారు. ఆయన విచారణ చేపట్టి, నివేదికను పోలీస్ ఉన్నతాధికారులకు అందజేశారు. అనంతరం సెప్టెంబర్ ఒకటిన పలు సబ్ డివిజన్ల పరిధిలోని ఏడుగురు ఏఎస్‌ఐలు, ఎనిమిది మంది హెడ్ కానిస్టేబుళ్లను పలు పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేశారు. ఇక వీఆర్‌లో ఉన్న నరసింహారావుపై గతనెల రెండో వారంలో సస్పెన్షన్ వేటు పడింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం డీఎస్పీ సుభాష్‌ను వీఆర్‌కు పంపిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

కొత్తపేట ఏఎస్‌ఐ సస్పెన్షన్

గుంటూరు జిల్లా తూర్పు సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తించే ఎన్.రవికుమార్‌పై సస్పెన్షన్ వేటుపడింది. ఇటీవల ఆయన ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో శుక్రవారం సస్పెండ్ చేశారు. ఏఎస్‌ఐగా రవికుమార్ సుమారు ఏడాది నుంచి కొత్తపేట పీఎస్‌లో పనిచేస్తున్నారు.

దుర్గమ్మకు బంగారు మంగళ సూత్రాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విజయవాడ ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన మహేశ్వర్‌రెడ్డి దంపతులు బంగారపు మంగళ సూత్రాలను శుక్రవారం విరాళంగా సమర్పించారు. సుమారు 214 గ్రాముల బంగారంతో తయారు చేసిన రెండు మంగళ సూత్రాలు, బంగారు గొలుసును ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా.. చైర్మన్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు ఆసక్తి ఉన్న రైతులు, అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ నుంచి ప్రారంభం కానున్న ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులైన చిరుధాన్యాలు, పట్టుపురుగుల పెంపకం, వర్మి కంపోస్ట్, బయో ఫర్టిలైజర్స్ కోర్సులను ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించినట్లు చెప్పారు. కోర్సుల తరగతులు 8 వారాల పాటు(2 నెలలు) ఉంటాయని చెప్పారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఆండ్రాయిడ్ ఫోన్ కానీ, ట్యాబ్‌కానీ, కంప్యూటర్ కానీ కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఒక్కొక్క కోర్సుకు ఫీజు రూ.1500 చొప్పున చెల్లించి అక్టోబర్ చివరిలోగా పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను గానీ, 8008788776, 8309626619, 9110562727 నంబర్లలో పని వేళల్లో మాత్రమే సంప్రదించాలని కోరారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 525.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్‌కేంద్రానికి 27,685 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 855.80 అడుగుల వద్ద ఉంది.

క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో నాక్ బృందం పరిశీలన


నాక్ బృందం సభ్యులను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల : మాచర్ల పట్టణంలోని ఎస్కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ (ఎన్ఏఏసి) బృందం శుక్రవారం పరిశీలించింది. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రొఫెసర్లు ఎస్వీ కల్యాణకర్, బిస్వాంబర మిశ్రా, మెంబర్ కో ఆర్డినేటర్ డాక్టర్ టీఎం జోసఫ్‌లు కళాశాలకు చేరుకొని పరిశీలించారు. వీరికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ల్యాబ్, కంప్యూటర్ రూం, గ్రౌండ్, కళాశాలలో ఉన్న సౌకర్యాలు, కళాశాల నిర్వహణ తీరు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని బృంద సభ్యులు కలిశారు. వెనుకబడిన ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అన్నీ రకాల ప్రోత్సహమిచ్చి చర్యలు తీసుకోవాలని పీఆర్కే కోరారు. బృందం సభ్యులను పీఆర్కే సత్కరించి అభినందించారు. అనంతరం పూర్వ విద్యార్థులను అభినందించారు. పూర్వ విద్యార్థులు, కళాశాల విద్యార్థులతో పీఆర్కే మాట్లాడారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కుర్రి సాయి మార్కొండారెడ్డి, పోలవరం ఎస్ఈ బి సుధాకర్, ఎంఈఓ వేముల నాగయ్య, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు, విశ్రాంత తహసీల్దార్ స్వర్ణకమలకరరావు, డాక్టర్ రామలింగారెడ్డి, కిరీటిరెడ్డి, వి రామనాథ్, టి నాగేశ్వరరావు, విశ్రాంత హెచ్ఎం నాగిరెడ్డి, డాక్టర్ కమలాసనరావు, ఇమ్మడిశెట్టి రామలింగేశ్వరరావు, ఎఎస్ఐ గౌస్ మొహిద్దీన్, జక్కా శ్రీనివాసరావు, కొమెర శ్రీనివాస్, రామతులసిలు కళాశాల అభివృద్ధికి రూ.15లక్షలు అందించారు.

జాతీయ స్థాయిలో ఎన్‌సీసీ విద్యార్థి ప్రతిభ

ఫైరింగ్ పోటీల్లో మూడో స్థానం


మెడల్ సాధించిన రంగరాజును అభినందిస్తున్న స్కూలు యాజమాన్యం

చీరాల రూరల్: జాతీయ స్థాయిలో ఎన్‌సీసీ క్యాడెట్ ప్రతిభ చాటాడు. స్థానిక మరియమ్మపేటలోని సెయింట్ ఆన్స్ స్కూల్ 9వ తరగతి విద్యార్థి పగడాల ఈశ్వర్ రంగరాజు ఎన్‌సీసీలో జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించాడు. బ్రాంజ్ మెడల్ అందుకున్నాడు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక స్కూలు ఆవరణలో రంగరాజుకు అభినందన సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ జీనా జేవియర్, వైస్ ప్రిన్సిపాల్ ఆరోగ్య మేరి, కరస్పాండెంట్ ట్రీసా మాట్లాడుతూ తమ స్కూలుకు చెందిన విద్యార్థి ఎన్‌సీసీలో జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ గొర్ల గోపినాథ్ మాట్లాడుతూ తల్‌సైనిక్ క్యాంపునకు ఎంపికైన ఈశ్వర్ రంగరాజు ఎంతో కష్టపడ్డాడని, స్కూల్లో ఎన్‌సీసీ ఏర్పాటు చేసిన రెండో ఏడాదిలోనే అద్భుతమైన ఘనత సాధించాడన్నారు. క్యాంపునకు ఎంపికైన నాటి నుంచి చీరాల, ఒంగోలు, తిరుపతి, కాకినాడ, రాజమండ్రి, హైదరాబాదుల్లో కఠోర శిక్షణ పొందినట్లు చెప్పారు. గతనెల 28న ఢిల్లీలో ఎన్‌సీసీ మైదానంలో జరిగిన పోటీల్లో 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లకు చెందిన 578 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొనగా రంగరాజు మూడో స్థానం సాధించాడని తెలిపారు. మేజర్ జనరల్ పీఎస్ నెహరవత్ చేతుల మీదుగా సేనా మెడల్ అందుకున్నాడని, ఈనెల 4న సికింద్రాబాద్‌లో డెప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి అభినందించి మెడల్ అందజేశాడని చెప్పారు. అలానే గుంటూరు గ్రూప్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతం 23 (ఏ) ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్, సిబ్బంది, విద్యార్థులు ఈశ్వర్‌ను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు బోయిన ధనుంజయ, విజయ నిర్మల పాల్గొన్నారు.

మూడు రాజధానులతో రాష్ట్రం అభివృద్ధి

సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు మాదిగాని


గురునాథానికి సంఘీభావం తెలుపుతున్న దళిత, గిరిజన, ఉద్యోగ సంఘాల నాయకులు

చీరాల: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే గొప్ప లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మూడు రాజధానులు ఏర్పాటు చేశారని.. మూడు రాజధానులతో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో ఉంటుందని సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం అన్నారు. శుక్రవారం చీరాల పర్యటనకు వచ్చిన ఆయనను చీరాల ప్రాంతంలో దళిత గిరిజన బహుజన, ఉద్యోగ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మూడు రాజధానులకు మద్దతుగా తాటికొండలో గత 1174 రోజులుగా గురునాథం ఆధ్వర్యంలో బహుజన పరిరక్షణ సమితి మద్దతుగా చేస్తున్న దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మూడు రాజధానుల ఏర్పాటు చారిత్రాత్మకమని, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జనరంజక పాలన చేస్తున్నారని చెప్పారు. నిరుపేదలకు నివాస కాలనీల్లో 55 వేల ఇళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. సీఎం ఈనెల 23న విశాఖపట్నం నుంచి పరిపాలన ప్రారంభించడం శుభపరిణామని చెప్పారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి అన్ని రంగాల్లో ముందంజలో ఉండటాన్ని ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు నిరాధార, అర్థరహిత ఆరోపణలను ప్రజలందరూ తిప్పికొడుతున్నారని వివరించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీకి అధికారం ఇస్తారని చెప్పారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన బాధ్యతలు స్వీకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడు రాజధానుల నిర్ణయాన్ని ప్రజలందరూ స్వాగతిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు అందె నరసింహారావు, నిరంజన్, ప్రదీప్, వేణురెడ్డి, ప్రసాద్, గిరీష్ ఉన్నారు.

తిరుపతమ్మ ఆలయంలో అభివృద్ధి పనులు

- రూ.1.50 కోట్లతో వివిధ పనులు నిర్వహణ
- టెండర్లు పూర్తి చేసి మార్కింగ్ ఇచ్చిన అధికారులు
- వార్షిక కల్యాణం జరిగే స్థలం చుట్టూ ప్రహరీ, డ్రైనేజి, సీసీ రోడ్డు నిర్మాణం



అభివృద్ధి చేస్తున్న అమ్మవారి వార్షిక కల్యాణం జరిగే స్థలం (ఫైల్)

పెనుగంచిప్రోలు: జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న తిరుపతమ్మవారి ఆలయం వద్ద, మునేరు అవతల అమ్మవారి మామిడి తోటల్లో రూ.13.50 కోట్లతో ఇప్పటికే అభివృద్ధి పనులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కృషితో శరవేగంగా జరుగుతున్నాయి. దీనికి తోడు అమ్మవారి వార్షిక కల్యాణం జరిగే స్థలం చుట్టూ రూ.1.50 కోట్లతో ప్రహరీ, సీసీ రోడ్డు, డ్రెయినేజి నిర్మాణానికి టెండర్లు పూర్తి కావటంతో అధికారులు పనులు చేపట్టేందుకు మార్కింగ్ ఇచ్చారు.

తగ్గనున్న ట్రాఫిక్ కష్టాలు...

కల్యాణం జరిగే స్థలాన్ని అభివృద్ధి చేయటం ద్వారా నిత్యం అమ్మవారి దర్శనానికి వచ్చే వందలాది వాహనాల పార్కింగ్ సమస్య తొలగటంతో పాటు మైత్రి రోడ్డుకు ఈ స్థలాన్ని అనుసంధానం చేయటంతో గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు కూడా తొలగనున్నాయి. సుమారు 5 ఎకరాలు మునేరు పక్కన ఉన్న ఈ స్థలం ఇరిగేషన్ వారి కింద ఉన్నది. దానిని ప్రభుత్వ విప్ ప్రత్యేక కృషితో దేవదాయ శాఖకు ఇరిగేషన్ శాఖ అప్పగించింది. ఈ స్థలంలోకి గ్రామం నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు, ఆలయం వద్ద నుంచి వచ్చే నీరు అంతా ఎక్కడ నిలవకుండా డ్రైనేజి నిర్మాణం చేపడుతున్నారు. మైత్రి రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇటీవలన గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఈ స్థలం అభివృద్ధి చేయటంతో అమ్మవారి వార్షిక కల్యాణానికి ఇబ్బందులు తొలగనున్నాయి. సుమారుగా ప్రతి ఏడాది లక్ష మందికి పైగా భక్తులు కల్యాణోత్సవానికి వస్తారు. చుట్టూ అపరిశుభ్ర వాతావరణం దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న అభివృద్ధి పనులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


స్థల అభివృద్ధి నమూనా మ్యాప్

కొద్ది రోజుల్లో ప్రారంభమవుతాయి



అమ్మవారి వార్షిక కల్యాణం జరిగే స్థలం చుట్టూ ప్రహరీ, డ్రైనేజి, సీసీ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. పనులు కొద్ది రోజుల్లో ప్రారంభమవుతాయి. మునేరు పక్కన ఉన్న ఇరిగేషన్ స్థలం ఎమ్మెల్యే ఉదయభాను ప్రత్యేక కృషితో దేవదాయ శాఖకు అప్పగించటంతో ఈ పనులు ప్రారంభం కానున్నాయి. స్థలం చుట్టూ అభివృద్ధి జరిగితే కల్యాణం తరువాత ఇక్కడ వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు ఉండవు.

–కె.రమేష్‌నాయుడు, ఆలయ ఈఓ

జిల్లా కబడ్డీ జట్టు ఇదే..

చేబ్రోలు: స్థానిక సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అండర్-19 జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక కోసం పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుచరిత పోటీలను ప్రారంభించారు. 25 కళాశాలల నుంచి సుమారు రెండు వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలికల కబడ్డీ జట్టుకు షాజనాబి, హరిత, పూర్ణశ్రీ, నందు, జోత్స్న, స్వాతి, యామిని, రేష్మ, బాల సైదులు, కే.దివ్యలను ఎంపిక చేశారు. ఎంపిక పోటీలకు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.కోటేశ్వరి, పీడీలు ఉదయభాస్కర్, శంకర రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పద్మాకర్ పాల్గొన్నారు.

మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ మోపిదేవి


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మోపిదేవి, పక్కన శాప్ నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభించనున్న 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి సంక్షేమ పథకాలను, జగనన్న పాలనను ప్రజలకు వివరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ పాల్గొన్నాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్ల ఎంపిక..


ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న తెనాలి డీవైఈఓ నిర్మల

వేజండ్ల(చేబ్రోలు): స్థానిక వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అండర్-17 బాల బాలికల జిల్లా వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు జరిగినట్లు హెచ్ఎం టి.విజయశ్రీ తెలిపారు. జిల్లా వాలీబాల్ జట్టు ఎంపిక కార్యక్రమాన్ని తెనాలి డీవైఈవో ఎం నిర్మల ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో సెలక్షన్స్ విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారు. ఉత్సాహభరితంగా జరిగిన పోటీలలో జిల్లా అండర్-17 జిల్లా వాలీబాల్ బాలిబాలికల జట్టును ఎంపిక కార్యక్రమాన్ని పూర్తి చేశారు. బాలికల విభాగంలో ఎస్కె సోనీ, ఎం.సుమశ్రీ,, బి.మణిత, సిహెచ్ ప్రసన్న, ఎన్.దీప్తి, వై.లావణ్య, టి.సహీద, ఎస్కె బాసీరున్నీసా, డి.కీర్తన, సిహెచ్ మాధవి, టి.సాయిసుష్మ, టి.హెచ్. సుచరిత, జె.శ్రీలక్ష్మిలు ఎంపికయ్యారు. అలాగే బాలుర విభాగంలో చాంద్‌బాషా, వెంకటేశ్వరరావు, హుస్సేన్, సి.హెచ్.శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, టి.నాగూల్‌మీరా, మస్తాన్ షరీఫ్, సుధాకర్, కోటేశ్వరరావు, సీతారామయ్యలను ఎంపిక చేశారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, సీహెచ్ వినయ్‌కుమార్, ఎస్కే కరీముల్లా, మస్తాన్ రెడ్డి, నందకుమార్, రజనీనాయక్, ఎం రవి, స్థానిక పీఈటీ టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

నరసరావుపేట: విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయటం జరుగుతుందని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ చీఫ్ జనరల్ మేనేజర్ డి.సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌లోని వాసవి కల్యాణ మండపంలో నరసరావుపేట డివిజన్ పరిధిలో ఉన్న సబ్ డివిజన్ రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుత్ ఆపరేషన్, మెయింటెన్స్‌కు సంబంధించిన అన్ని అంశాలపై అధికారులు, సిబ్బందితో సమీక్ష చేశారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో ఎలక్ట్రికల్ ప్రమాదాలు, వాటి నివారణకు చర్యలు ఏవిధంగా తీసుకోవాలనే అంశంపై సమీక్ష చేశారు. విద్యుత్ వాడకందారుల పట్ల ప్రతి ఒక్క ఉద్యోగి జవాబుదారీతనంగా ఉండాలని, కార్యాలయానికి వచ్చిన వినియోగదారుని పట్ల మంచి ధోరణితో మెలగాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ వాడకందారులకు అంతరాయం లేకుండా విద్యుత్ ఇచ్చేందుకు మూడు జిల్లాల్లో అనేక నూతన విద్యుత్ ఉపకేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్క విద్యుత్ వాడకందారుడు బకాయిలు లేకుండా బిల్లులు చెల్లింపులు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీల విద్యుత్ వాడకందారులకు రెండు వందల యూనిట్స్ వరకు జగ్జీవన్ జ్యోతి యోజన క్రింద ప్రభుత్వ సబ్సిడీ ద్వారానే ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. గుంటూరు జిల్లా సీనియర్ అకౌంట్స్ అధికారి కె.సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మార్టూరు: రోడ్డుపై వెళ్తున్న మహిళను ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. ఈ ఘటన ద్రోణాదుల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కే కమలాకర్ అందించిన వివరాలు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన గద్దల అక్కమ్మ(52) గురువారం ఉదయం ద్రోణాదుల నుంచి నాగండ్ల వైపు వెళ్లే మార్గంలో నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో జే పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన ఏటీ మణికంఠ బైక్‌తో ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అక్కమ్మను బంధువులు గుంటూరు ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె భర్త యోహాను ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి..

చీరాల రూరల్: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చీరాల- వేటపాలెం రైల్వే స్టేషన్‌ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్ కొండయ్య అందించిన వివరాలు.. రైలు పట్టాలపై వ్యక్తి మృతి చెందాడనే సమాచారంతో సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి సంబంధించిన తల, మొండెం వేరుగా ఉన్నాయని, మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. కారణాలు కూడా తెలియరాలేదని ఎస్ఐ వివరించారు. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉంటుందని చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రుణ విస్తరణే ధ్యేయం


మాట్లాడుతున్న రాకేష్ కశ్యప్

ఒంగోలు సబర్బన్: రుణ విస్తరణే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ పేర్కొన్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన బ్యాంకు అధికారులు, కస్టమర్లతో శుక్రవారం స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీజీబీ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో 56 శాఖలతో ప్రజలకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ రెండు జిల్లాల్లో కలిపి రూ.4,080 కోట్ల అధిక వ్యాపార వాటా కలిగి ఉన్నామని వివరించారు. రూ.2,151 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పారిశ్రామికవేత్తలు, ఇతర వ్యాపారాలు నిర్వహించుకునే వారికి రుణాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఒంగోలులో సరళ రుణ కేంద్రాలను ప్రారంభించి, రూ.10 లక్షలు అంతకంటే పైబడిన రుణాలను త్వరితగతిన మంజూరు చేయడానికి డెడికేటెడ్ స్కిల్డ్ స్టాఫ్‌ను నియమించామని పేర్కొన్నారు. అనంతరం ఒంగోలులో ర్యాం కార్నివాల్ కాంపెయిన్‌ను ప్రారంభించారు. నవంబర్ 30వ తేదీ వరకు క్యాంపెయిన్ కొనసాగుతుందని ఏపీజీబీ చైర్మన్ చెప్పారు. బ్యాంక్ జనరల్ మేనేజర్ పిర్ పడగేట్వేర్ మాట్లాడుతూ.. ర్యాం కార్నివాల్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 90 మంది ఖాతాదారులకు గృహ, వాహన, విద్య, వ్యాపార, వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు రూ.7.50 కోట్లు మంజూరు చేశారు. ఏపీజీబీ సేవలను ఎల్‌డీఎం అబ్దుల్ రహీం కొనియాడారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం రవికుమార్, బ్యాంకు ఆర్ఎం బి.హేమలత పాల్గొన్నారు.